క్లుప్తంగా

శ్రీవారి సేవలో విజయవాడ విజిలెన్స్ ఎస్పీ


పూజలు నిర్వహిస్తున్న కనకరాజు

ద్వారకాతిరుమల : చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని విజయవాడ విజిలెన్స్ ఎస్పీ కనకరాజు శనివారం సాయంత్రం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు.

ఎంపీ కోటగిరి పరామర్శ


రాఘవేంద్రరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

చింతలపూడి : చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కనమతరెడ్డి రాఘవేంద్రరెడ్డిని ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు శనివారం పరామర్శించారు. ఇటీవల రాఘవేంద్రరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను ఎంపీ పరామర్శించి త్వరగా కోలుకోవాలన్నారు. ఎంపీ వెంట ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, నాయకులు గిరి భోగారావు, ఆర్వీ రామారావు, గడ్డమడుగుల రాజేష్‌నాయుడు, కె రాంబాబు ఉన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

కామవరపుకోట : మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక యూటీఎఫ్ నాయకులు శ్యాంబాబు, అల్లాడి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కామవరపుకోట మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా నల్లమోతుల సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా వీఎస్ఆర్ ఎస్.ఆచార్యులు, ఉపాధ్యక్షుడిగా మల్లా రాజా, ప్రధాన కార్యదర్శిగా ఎ.భూషణరాజు, సభ్యులుగా టీడీ అబ్రహం, కె.గోపాలరావు, బి.మోక్షానందం, దాసిరాజు, కె.చిన్న పల్లాలు, కె.రవీంద్ర, బి.రాములు, బి.రమేష్ ఎన్నికయ్యారు.

ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం : దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన మల్లిడి మాధవి కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఆ గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు శనివారం ఆమె నివాసం వద్దకు వెళ్లి రూ.11 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరపున కూడా సహాయం అందేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. సర్పంచ్ సున్నం శాంతి కుమారి, సెక్రటరీ కాజా బాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నూనె నాగు, వీఆర్వో మధు, ఇస్మాయిల్, నూనె వెంకటేశ్వరరావు, సున్నం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ మానవత్వం


బాధిత కుటుంబానికి సేకరించిన నగదును అందిస్తున్న వలంటీర్ పిల్లం రేణుక

చింతలపూడి : వలంటీర్లు వారి విధులను నిర్వహించడంతో పాటు, సామాజిక బాధ్యతను కూడా పాటిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. రాఘవాపురం గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉప్పులూరి ఆనందరావు (50) కొద్దీ రోజులుగా పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో ఆ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఇది గమనించిన వలంటీర్ పిల్లం రేణుక గమనించి ఆ వీధి పరిధిలో ఉన్న వారి వద్ద నుంచి రూ.9 వేలు సేకరించి బాధిత కుటుంబానికి శనివారం అందచేసింది. వలంటీర్ చూపిన చొరవకు ఆనందరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం


నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కుక్కునూరు : తొండిపాక పంచాయతీ బంజరగూడెంలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన ముత్తినేని శ్రీను, అన్నపూర్ణ కుటుంబానికి బంజరగూడెం వైఎస్సార్ సీపీ నాయకులు చేయూతనందించారు. పోలవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, రూ.2 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులతో పాటు రూ.6 వేల నగదును అందజేశారు. సచివాలయ కన్వీనర్ బషీర్, భాస్కర్, పర్సిక, వెంకటేశ్వర్లు, చారి పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

జంగారెడ్డిగూడెం : స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్టి, అనంతరం స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని సూర్యప్రభ వాహనం మీద ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో సుదర్శన పెరుమాళ్‌కు చక్రస్నానం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు పూజాకార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నదాతలుగా దుగ్గిరాల వేంకట సుబ్బారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు పి.జగపతి రాజు, దండు. దనరాజు, అబ్బిన దత్తత్రేయ, వాసవి సాయినగేష్, వందనపు సాయి బాలపద్మ, బూరుగుపల్లి రవీంద్ర, పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి


మద్ది అంజన్న సన్నిధిలో సినీనటి ఆమని

ఆవుపాలతో క్షీరాన్నం

రథసప్తమి పర్వదినాన్ని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బుట్టాయగూడెం రోడ్డులోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో పరిషత్ సభ్యులు ఆవుపిడకలపై ఆవుపాలతో క్షీరాన్నం తయారుచేసి సూర్యభగవానునికి నివేదనచేసి భక్తులకు ప్రసాదవితరణ చేశారు. ప్రత్యక్ష భగవానుడైన సూర్యుడు ఆరోగ్య కారకుడని ప్రతి ఒక్కరూ సూర్యభగవానుని పూజించి ఆయురారోగ్యములు పొందాలని పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు కొనకళ్ళ వెంకటేశ్వరరావు, కొంచాడ దుర్గాప్రసాద్, కుమారి, తోట రామకృష్ణ, కంచర్ల గుప్త, బీజేపీ సభ్యులు కొనకళ్ళ వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మద్దిలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మార్గశిర శుద్ధ సప్తమి రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు ప్రకాష్ శర్మ, శ్రీరాంకుమార్ సూర్య నమస్కారాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ: 95,010 వచ్చినట్లు, వెయ్యి మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

అంజన్నను దర్శించిన ప్రముఖ నటి ఆమని

గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని ప్రముఖ సినీ నటి ఆమని దర్శించుకున్నారు. తొలుత ఆలయ మర్యాదలతో అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగరావు పాల్గొన్నారు.

ఊరేగిన పాండురంగస్వామి

పోలవరం రూరల్ : రథసప్తమి సందర్భంగా పోలవరం గ్రామంలోని పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పల్లకీలో ఊరేగించారు. వాయిద్యాలు, విచిత్రవేష ధారణల నడుమ బాణసంచా పేల్చుతూ ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం ప్రతినిధి ఈమని శశి కుమార్ శర్మ పర్యవేక్షణలో నిర్మితమవుతున్న శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా గురువారం ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మార్చి ఒకటో తేదీ నుంచి నాలుగు రోజులపాటు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామానుజపురంలో హౌసింగ్ డే

కొయ్యలగూడెం : రామానుజపురంలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. సర్పంచ్ అడపా నాగ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తహసీల్దార్ నాగమణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహించడం వల్ల ప్రజలలో అవగాహన ఏర్పడుతుందని, ముఖ్యంగా గృహాలు మంజూరైన వారికి ఎంతో ఉపయోగ పడుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు. హౌసింగ్ శాఖ ఏఈ మధు మంజూరైన ఇళ్లు, వాటి నిర్మాణ దశలను వివరించారు. ఎంపీటీసీ ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

గడపగడపకు బాగోగులు తెలుసుకుంటూ ..

- ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పరిశీలన
- జంగారెడ్డిగూడెం 3వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని 3వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ఇంటింటికి వెళుతూ ప్రభుత్వ పాలనపై అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు అందిన లబ్ధిని తెలియజేసే కరపత్రాన్ని అందించడంతో పాటు వారి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు, ఇంటి స్థలాలు, వసతి దీవెన, విద్యాదీవెన, అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, చేదోడు ఇలా ప్రతీ పథకంలో ఏదో ఒక పథకం తమకు అందిందని ప్రజలు చెబుతున్నారన్నారు. వారి స్పందన చూస్తుంటే రాబోయే కాలం కూడా ఖచ్చితంగా వైఎస్సార్ సీపీదే అని తెలుస్తోందన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చిరకాలం ఉండాలని వారు ఆకాంక్షను తెలుపుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాగా గడపగడపకు కార్యక్రమంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని, ముఖ్యంగా ఈ ప్రాంతంలో డ్రెయిన్ సమస్య తన దృష్టికి వచ్చిందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు మార్చాలని ప్రజలు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, ఉభయగోదావరి జిల్లాల బూత్ కన్వీనర్‌ల కో-ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, స్థానిక కౌన్సిలర్ మేకా రమాదేవి, పార్టీ సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, ఏఎంసీ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవికుమార్, చనమాల శ్రీను, షేక్ అక్బర్, కేమిశెట్టి మల్లిబాబు, చిప్పాడ వెంకన్న, గూడపాటి రాధాకృష్ణ, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

లోకేష్‌ది యువ గరళం యాత్ర

కొయ్యలగూడెం : ఐరన్ లెగ్‌కి ప్రతిరూపం అయిన నారా లోకేష్ చేపట్టింది యువగళం యాత్ర కాదు అని యువ గరళం యాత్ర అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. శనివారం మంగపతిదేవి పేట గ్రామంలో ఎంపీటీసీ తేలే శ్రీనివాస్‌తో కలిసి పార్టీ శ్రేణులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివంగత వైఎస్సార్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిలను చూసి నారా లోకేష్ పాదయాత్ర చేపట్టారని, ఇది పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం లాంటిదని విమర్శించారు. పుష్కరాల సమయంలో లోకేష్ కాలు పెట్టగానే 29 మందిని పొట్టన పెట్టుకున్నారని, యువ గళం అంటూ పోస్టర్ రిలీజ్ చేస్తే 8 మందిని బలి తీసుకున్నారన్నారు. తాజాగా బావమరిది తారకరామ్‌ని కూడా మృత్యుముఖం ముంగిట ఉంచారన్నారు. ప్రజలు లోకేష్ యువగరళ యాత్రకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో చిడిపి వెంకటరమణ, ఎస్కే బాజీ, చిడిపి రవి, జక్కు గోపాలం, చిడిపి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.


మంగపతిదేవిపేట గ్రామంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్, ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులు

కత్తెర పురుగు నివారణ చర్యలపై అవగాహన

బుట్టాయగూడెం : మొక్కజొన్న సాగులో కత్తెర పురుగు ఆశించినప్పుడు వాటి నివారణపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏఓ సుమలత అన్నారు. మర్లగూడెంలో మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశించడాన్ని శనివారం గుర్తించి నివారణ చర్యలను వివరించారు. హిమామెక్టిన్ బెంజోయెట్ 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని, దీనితోపాటు వేప నూనె 5 మిల్లీ లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా మిరపపంటను ఆశించే తామరపురుగు నివారణకు డైఫెన్ థూరియన్ 50 ఈసీ మందును వాడాలని రైతులకు సూచించారు. ఉపసర్పంచ్ అందుగుల శేషారత్నం, వ్యవసాయ సిబ్బంది ఎం.సురేష్, వి.మౌనిక, ఎం.ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం

పోలవరం రూరల్ : మండల పరిషత్ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం నిర్వహించిన పోలవరం మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యలను ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువస్తే.. దీనిపై సమాధానం చెప్పేందుకు అధికారులు లేకుంటే ఎలా అని మండిపడ్డారు. అనంతరం నెక్లెస్ బండ్ నిర్మాణంతో వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక నీరు నిల్వ ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డ్రెయిన్ వ్యవస్థ కూడా లేదని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని అంగన్‌వాడీ సెంటర్‌లలో పౌష్టికాహారంలో లోపాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రాజెక్టు అధికారులతో పాటు సూపర్‌వైజర్లు సెంటర్‌లలో పర్యవేక్షణ పెంచాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా 10,123 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు వ్యవసాయశాఖ ఏవో కె.రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని పలు సమస్యలను సమావేశంలో చర్చించారు. జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, తహసీల్దార్ బి.సుమతి, ఏఈ కేవీ రమణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

హెల్మెట్ భారం కాదు.. భరోసా


బుట్టాయగూడెంలో వాహనదారులచే హెల్మెట్ ధరింపచేసిన ఎస్సై జయబాబు

బుట్టాయగూడెం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం. జయబాబు అన్నారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో హెల్మెట్ వాడకంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదం బారి నుంచి తప్పించుకోవాలంటే తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. హెల్మెట్ వాడని వారికి ఎస్సై జయబాబు జరిమానా విధించకుండా అక్కడికక్కడే హెల్మెట్‌లు కొనిపించి వారు ధరించే విధంగా కృషి చేశారు.

వాహనదారులకు అవగాహన

జంగారెడ్డిగూడెం : పట్టణంలో శనివారం హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో హెల్మెట్ లేని వాహనదారులను గుర్తించి వారికి అవగాహన కల్పించడంతోపాటు, హెల్మెట్‌ను కొనుగోలు చేయించి ధరింప చేశారు. ఈ సందర్భంగా ఎస్సై పి.రామకృష్ణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు వారి పిల్లలకు వాహనాలు ఇచ్చేప్పుడు వారు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన చట్టాల రద్దును నిరసిస్తూ ధర్నా

జంగారెడ్డిగూడెం : ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సీనియర్ నాయకుడు ధర్మల సురేష్ పిలుపునిచ్చారు. ఆదివాసీల భూములకు రక్షణగా ఉన్న 1/70 యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టులో వేసిన కేసును నిరసిస్తూ శనివారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ అడవిలో ఉన్న బాక్సైట్, బొగ్గు అల్యూమినియం, ఐరన్ ఓర్ తదితర గనులను ఆదానికి కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అడ్డుగా ఉన్న గిరిజన చట్టాలను నేడు రద్దు చేయడానికి సవరణ చేశారని ఆరోపించారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వెట్టి సుబ్బన్న, అరుణోదయ నాయకులు పి.శ్రీనివాస్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ నాయకులు కారం రాఘవ, పీఓడబ్ల్యూ నాయకులు వెట్టి భారతి, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి రామ్మోహన్ తదితరులు మాట్లాడారు. అనంతరం ఆర్డీవో ఝాన్సీరాణికి వినతిపత్రం అందజేశారు.

సైకిళ్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం : స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇద్దరు విద్యార్థులకు వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. నువ్వుల శామ్యూల్ కృపావరం వితరణతో ఆరవ తరగతి విద్యార్థి షేక్ షరీనా, ఏడో తరగతి విద్యార్థి బసివిరెడ్డి రామ సిరిలక్ష్మి పావనిలకు ఈ సైకిళ్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గడా జగ్గారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల్నాటి బాబ్జీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ, ధనకుమార్, ఎంఈవో బుద్దుల రాముడు, ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ బి.భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మించాలి

కొయ్యలగూడెం : నాణ్యత ప్రమాణాలతో రోడ్డును నిర్మించాలని, ప్రస్తుతం జరుగుతున్న పనులలో నాణ్యత లేదని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం బయ్యనగూడెం గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకొని సంబంధిత శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారి 516(డి) హైవే నిర్మాణ నేపథ్యంలో రోడ్డు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లోపాలతో పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే ముందు పేర్కొన్న విధంగా కాకుండా రహదారి విస్తరణ పనులు మార్పులు, చేర్పులు చేసి రోడ్డు నిర్మిస్తున్నారన్నారు. ఎంతోకాలంగా రోడ్డు అభివృద్ధి కోసం ఎదురుచూశామని, అయితే పనులు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ లింగిసెట్టి అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ కోరుకొండ లలిత తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మునిసిపల్ కార్మికుల ధర్నా

జంగారెడ్డిగూడెం : పారిశుధ్య కార్మికులకు ముఖ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ గౌరవ అధ్యక్షుడు జేవీ రమణరాజు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలో అందచేశారు. కార్మిక నాయకులు పాల్గొన్నారు.

186 మంది రోగులకు వైద్య పరీక్షలు

కామవరపుకోట : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తడికలపూడి శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్, ఏలూరు గుడ్ సమ్మరిటన్ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ వారిచే శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యశాఖ అధికారి డాక్టర్ ప్రసన్న కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 186 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 92 మందికి రూ.3 వేల విలువగల గుండె స్కానింగ్ పరీక్షలు, ఇతర పరీక్షలు నిర్వహించారు. 18 మందికి మెరుగైన వైద్య చికిత్సల కోసం విజయవాడ ఆస్పత్రికి సిఫారసు చేశారు. మానవ హక్కుల వెల్ఫేర్ సంఘ కార్యదర్శి కోటేశ్వరరావు, రత్న, మానవత సంస్థ అధ్యక్షుడు ఎస్.కాంతారావు, గంగాధర్ ప్రసాద్, పార్వతీశంకర్, వి.శ్రీనివాసరావు, జీవీవీ సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, అంబటి రాజా, గంట నాగేశ్వరరావు, రజిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

జంగారెడ్డిగూడెం : సచివాలయ మహిళా పోలీసులతో జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆర్.వరలక్ష్మి పాల్గొని మాట్లాడారు. పిల్లలు, విద్యార్థినులకు చట్టాలు, రక్షణ గురించి సచివాలయ మహిళా పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. ఫిబ్రవరి 11న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, జీఎంఎస్కే, డబ్ల్యూఎంఎస్కే పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. స్థానిక భారతీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

బుట్టాయగూడెం : మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని, సురక్షితమైన వాతావరణంలో చదువులను కొనసాగిస్తూ బాధ్యత గల పౌరులుగా అభివృద్ధి చెందాలని ఎస్సై ఎం.జయబాబు, ఎస్ఈబీ ఎస్సై మస్తానయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వైపు విద్యార్థులు మొగ్గుచూపకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భక్తహనుమాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల : యువతి అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాళ్లకుంటకు చెందిన పోలుబోయిన లలిత దివ్య ఏలూరులోని ఒక కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్న ఆమె ఉదయం 10 గంటల నుంచి కనిపించడం లేదు. నల్లజర్ల మండలం అయ్యవరానికి చెందిన ఒక యువకుడిపై అనుమానం ఉన్నట్టు ఆమె తండ్రి రవికుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుధీర్ తెలిపారు.